

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్..

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు వేళయ్యింది. రేపటి నుంచి ప్రాసెసింగ్ ఫీజు చెల్లించుకోవచ్చు.

- 8లో



ముగిసిన ఏపీఈఏపీ సెట్

ఏపీఈఏపీ సెట్ మంగళవారంతో ముగిసింది. ఈ నెల 15 నుంచి పరీక్షలు జరుగుతున్నాయి.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	35°	27°
ఇచ్ఛాపురం	35°	27°
పాతపట్నం	35°	26°
శ్రీకాకుళం	35°	26°

న్యూస్‌రీల్

పంచాయతీ కార్యదర్శులపై డీఎల్‌పీఓ విచారణ



విచారణ జరుపుతున్న డీఎల్‌పీఓ గోపీబాల

పొందూరు: పొందూరు మండలంలోని తాడివలస, కోటిపల్లి పంచాయతీ కార్యదర్శులపై ఆయా పంచాయతీల సర్పంచ్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం డీఎల్‌పీఓ ఆర్.గోపీబాల విచారణ జరిపారు. తాడివలస పంచాయతీ కార్యదర్శి బి.వెంకటరావు విధులకు సక్రమంగా రావడం లేదని, సమయ పాలన పాటించడం లేదంటూ సర్పంచ్ తమ్మినేని మణెమ్మ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే కోటిపల్లి పంచాయతీలో సెక్రటరీ రాజశేఖర్ ఇంటి పన్నులు వసూలు చేసి పంచాయతీ ఖాతాకు జమ చేయలేదంటూ సర్పంచ్ గురుగుబెల్లి సుధారాణి ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆయన విచారణ జరిపారు. దీనిలో భాగంగా పలువురు వలంటీర్ల నుంచి సమాచారం సేకరించారు. విచారణ నివేదికలను జిల్లా అధికారులకు అందించనున్నట్లు డీఎల్‌పీఓ తెలిపారు. ఆయనతో పాటు మండల పరిషత్ కార్యాలయం ఈవో మురళీ తదితరులు ఉన్నారు.

శరత్‌బాబుకు ఘనంగా నివాళి



శరత్‌బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: సీనియర్ సినీ నటుడు శరత్‌బాబు మృతి ఆమదాలవలసకు తీరని లోటు అని సిటిజన్ ఫోరం అధ్యక్షుడు, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జేజే మోహన్‌రావు అన్నారు. ఆమదాలవలస పట్టణంలోగల శ్రీదేవి థియేటర్ ఆవరణలో మంగళవారం శరత్‌బాబు మృతికి సంతాపం తెలుపుతూ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శరత్‌బాబు స్నేహితులు, అభిమానులు, సిటిజన్ ఫోరం సభ్యులు ఎర్నాగుల ప్రభాకరరావు, జేకే వెంకటేశ్వరరావు, బొడ్డేపల్లి జనార్దనరావు, బొడ్డేపల్లి మోహన్‌రావు, బి.రాజేష్, కుసుమంచి శ్యామ్ ప్రసాద్, శిల్లా రవి, ఆమదాలవలసకు చెందిన కవి కె.వి.రాజారావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

శ్రీవారి సన్నిధిలో అన్నమయ్య కీర్తనల ఆలాపన



తిరుపతిలో నిర్వహించిన హరినామ సంకీర్తనంలో కీర్తనలు ఆలపిస్తున్న చిన్నాగురుస్వామి

ఇచ్ఛాపురం: కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వరుని సన్నిధిలో అన్నమయ్య కీర్తనలు ఆలపించేందుకు అవకాశం లభించిందని స్థానిక శ్రీ వేంకటేశ్వర డ్యాన్స్ అకాడమీ అధ్యక్షుడు చిన్నా గురుస్వామి తెలిపారు. ఆయన మంగళవారం తిరుపతిలో అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు కళాకారులను సత్కరించారు.

బరి తెగించి మరీ.. అక్రమానికి దారి



జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పాత్రునివలసలో అక్రమార్కులు బరితెగించారు. ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ అధికారులు పాతిన బోర్డులను కబ్జాదారులు తీసేశారు. ఆక్రమిత భూమిలో లేఅవుట్లు వేసి, దానికి అవసరమైన రోడ్లు వేసి దర్జాగా అమ్ముకుంటున్నారు. రెవెన్యూ సిబ్బంది అడ్డుకుంటున్నా.. వారి ఆగడాలు ఆగడం లేదు. **- సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం**

పాత్రుని వలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 171/1లో 1.29 సెంట్లు ప్రభుత్వ పోరంబోకు భూమి ఉంది. దాంట్లో 30 సెంట్లు ప్రభుత్వ గోర్జి భూమి ఉంది. పక్కనే వేసిన ప్రైవేటు లేఅవుట్ కోసం గోర్జి భూమిలో రోడ్డు వేసేశారు. ఈ రోడ్డును చూపించి లేఅవుట్‌లో ప్లాట్ల విక్రయాలు చేపడుతున్నారు. వాస్తవంగా, లేఅవుట్‌కు అనుమతి లేదని ప్రభుత్వ అధికారులు ధ్రువీకరిస్తూ ఆర్‌టీఐ కింద సమాధానం కూడా ఇచ్చారు. కానీ, ఆక్రమణదారులు అవేవి పట్టించుకోకుండా ఇష్టారీతిన అమ్మేస్తున్నారు.

- శ్రీకాకుళం సమీపంలో అక్రమంగా లే అవుట్లు
- పాత్రునివలసలో కోట్లాది రూపాయల భూ బాగోతం
- ఆక్రమిత భూముల్లో బ్యానర్లు ఏర్పాటు చేసిన అధికారులు
- ఆ బ్యానర్లు తొలగించి, చదును చేసిన ఆక్రమణదారులు





సర్వే నంబర్ 171/1లో గల ప్రభుత్వ గోర్జి భూమిలో లేఅవుట్ కోసమని అక్రమంగా వేసిన రోడ్డును గుర్తించి, ఆ స్థలంలో ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ అధికారులు ఏర్పాటు చేసిన బ్యానర్ ఇది. ఇప్పుడా భూమిలో ఉన్న బ్యానర్‌ను తీసేసి కబ్జాదారులు మళ్లీ చదును చేసేశారు.

- దీంతో ఇప్పుడక్కడ రహస్యంగా ప్లాట్లు విక్రయాలు చేసేస్తున్నారు.

పాత్రునివలస గ్రామంలో భూ బాగోతం బయటపడుతోంది. ఇక్కడ భూముల విలువ కోట్లలో ఉంటుంది. ప్రభుత్వ భూమి ఖాళీగా కనిపించడం, గతంలో అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవడంతో టీడీపీ ప్రభుత్వంలో కొంతమంది ఆక్రమించి దర్జాగా అక్రమ కట్టడాలు, రోడ్లు నిర్మించారు. ప్రభుత్వ గోర్జి భూమిలో రోడ్డు వేశారని గతంలో స్థానిక సిబ్బంది అడ్డుకోగా దాడి చేసిన సందర్భం కూడా ఉంది. అప్పటి ఎమ్మెల్యే దాడి చేసిన వారికి, దాడికి గురైన వారికి మధ్య రాజీ కుదిర్చారు. అప్పట్లో వేసిన రోడ్డును కూడా ధ్వంసం చేశారు. కానీ నాటి పాలకుల అండదండలతో మళ్లీ ధ్వంసం చేసిన రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు వేసేశారు. దీన్ని చూపించి పక్కనే ఉన్న లేఅవుట్‌లో స్థలాల విక్రయాలు చేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు జరిగిపోయాయి. మిగిలినవి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులు మరోసారి స్పందించి ఇవి పూర్తిగా ప్రభుత్వ భూములని పేర్కొంటూ కర్రలు పాతి, బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడా బ్యానర్లు కూడా తొలగించి తమకున్న అడ్డును కబ్జాదారులు తొలగించారు. రాత్రికి రాత్రి బ్యానర్లు పీకేసి, చదును చేసుకుని, ఇష్టారీతిన అమ్ముకుంటున్నారు.

ఇక్కడన్నీ అక్రమాలే...

ఇక్కడ 161/3లో కొంతమందికి పట్టాలిస్తే, వారు వేరొకరికి అమ్ముకున్నారు. ఈ విషయం తెలిసి అధికారులు ఆ పట్టాలు రద్దు చేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రైవేటు లేఅవుట్ వేసి, దాని కోసం ఈ స్థలంలోనే రోడ్డు వేశారు. ప్రభుత్వ గోర్జి భూమిలో కూడా లేఅవుట్ కోసం ప్రహరీ నిర్మించారు. దీనిపై కూడా ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వ భూమి అని హెచ్చరిక చేస్తూ బ్యానర్లు పెట్టారు. ఇప్పుడా బ్యానర్లను కూడా కబ్జాదారులు తొలగించారు. దశాబ్దాల కిందటే ఇక్కడ శ్మశాన భూమిని డీ పట్టాల కింద ఇచ్చేసినట్టు రికార్డులు చూపిస్తున్నాయి. శ్మశాన భూమిని రైతులకు ఎలా ఇచ్చారో ఎవరికీ అర్థం కావడం లేదు. అలాగని ఆ రైతులు సాగు చేస్తున్నారంటే అదీ లేదు. ఆ భూములనే రియల్టర్లకు అమ్మేశారు. ఆ భూముల్లో సదరు రియల్టర్లు లేఅవుట్ వేసి వ్యాపారం చేసుకుంటున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ఎవరికైనా డి పట్టాలిస్తే వాటిని సొంతానికి వినియోగించుకోవాలే తప్ప విక్రయించడానికి అవకాశం లేదు. అలాగే వ్యవసాయం కోసం ఇచ్చిన భూముల్లో నిర్మాణాలు చేపట్టడానికి లేదు. కానీ ఇక్కడ అడ్డగోలుగా పలు నిర్మాణాలు చేపట్టారు.



మేలుకోవాల్సిందే..

ఇటీవల కాలంలో పేదల ఇళ్ల స్థలాల కోసం ఎన్నో ఎకరాల ప్రైవేటు భూములను అధికారులు కొనుగోలు చేశారు. కానీ పాత్రునివలసలో ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని ఆక్రమించారని గుర్తించిన పాపానికి పోలేదు. లక్షలు వెచ్చించి కొనుగోలు చేయడానికి అధికారులు శ్రమించారే తప్ప ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో పేదల ఇళ్ల స్థలాలు ఇద్దామన్న ఆలోచనకు రాలేదు. ఇటీవల కాలంలో శ్రీకాకుళం చుట్టు పక్కల ప్రాంతాలకు పలు ప్రభుత్వ సంస్థలు వస్తున్నాయి. వాటికి స్థలాల అవసరం ఎంతో ఉంది. దానికోసం ల్యాండ్ బ్యాంకు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక్కడ ఎకరం విలువ రూ.కోట్లలో ఉంది. ఈ భూమిని పేదల ఇళ్ల స్థలాలకు, ప్రభుత్వ సంస్థలకు వినియోగిస్తే ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తుంది. అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించినట్టు అవుతుంది.



పాత్రునివలస రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 161/3 లో ల్యాండ్ సీలింగ్ భూమి 1.18ఎకరాలుంది. ఇందులో 92 సెంట్ల భూమిని ముగ్గురికి పట్టాల రూపంలో సర్వే నంబర్ 161/3పీ కింద ఇచ్చారు. అయితే ఆ భూములపై క్రయవిక్రయాలు జరిపారు. ప్రభుత్వం ఇచ్చిన భూమి దుర్వినియోగమైందని ఫిర్యాదు రావడంతో విచారణ జరిపి, 2007 డిసెంబర్ 20వ తేదీన రెవెన్యూ అధికారులు ఆ పట్టాలు రద్దు చేశారు. అయినప్పటికీ పట్టాలు రద్దయిన భూముల్లో కొందరు ఆక్రమణదారులు చొచ్చుకొచ్చారు. ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమణ చేస్తున్నారు. మరో విశేషమేమిటంటే పట్టాదారులకు ఇవ్వగా మిగిలిన 26 సెంట్ల భూమిలో కూడా లేఅవుట్ కోసమని అక్రమంగా రోడ్డు వేసేశారు.

లేవుట్ ప్రహరీ కోసం శ్మశానస్థలంలో నిర్మించిన ప్రహరీ ఇది. పాత్రుని వలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 170/1లో 98 సెంట్లలో ఈ శ్మశానం ఉంది. కానీ ఇందులో కొంత భూమిని డీ పట్టాల కింద ఇద్దరికి ఇచ్చారు. దశాబ్దాల కిందటే పట్టాలు ఇచ్చినట్టుగా రికార్డులు చూపిస్తున్నాయి. శ్మశాన భూమిని పట్టాల కింద ఎలా ఇచ్చారో నాటి అధికారులకే తెలియాలి. వాస్తవానికైతే శ్మశాన భూమిని డీ పట్టాల కింద ఇవ్వడానికి లేదు. ఇప్పుడా పట్టా (శ్మశానం) భూముల్లో తప్పుడు సర్వే నంబర్లతో కొనుగోలు చేసిన వారు ప్రహరీ నిర్మించారు.



సర్వే నంబర్ 161/3లోని ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా చొచ్చుకురావడమే కాకుండా లేఅవుట్ కోసం అక్రమంగా వేసిన రోడ్డుపై ఫిర్యాదు రావడంతో అధికారులు స్పందిస్తూ కర్రలు కట్టి, ఏర్పాటు చేసిన బ్యానర్ ఇది. పూర్తిగా ప్రభుత్వ ల్యాండ్ సీలింగ్ భూమి అని అందులో ప్రస్తావించారు. ఎవరైనా ఆక్రమించినా, మరే చర్యలు తీసుకున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరిక కూడా చేశారు.

- ఇప్పుడా బ్యానర్‌ను కూడా తొలగించి ఆక్రమణదారులు తమకు నచ్చినట్టు చదును చేసి, విక్రయాలకు సిద్ధం చేశారు.





కొనుగోలుదారులు జాగ్రత్త..

ఇక్కడున్న భూములు ప్రభుత్వానికి చెందినవి. కానీ, అవేవి తెలియని కొందరు అమాయకులు బలైపోతున్నారు. ప్రభుత్వ భూములని తెలియక చాలామంది కొనుగోలు చేసేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు కఠినంగా వ్యవహరించకపోతే ఆ లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారంతా మోసపోవడమే కాకుండా నష్టపోతారు.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ భూమి అని పేర్కొంటూ ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించిన సమాచారం నా దృష్టికి రాలేదు. వీఆర్‌ఓతో మాట్లాడుతా. ఒకవేళ బ్యానర్లు తొలగించినట్టు నిర్ధారణ అయితే తక్షణమే మళ్లీ బ్యానర్లు ఏర్పాటు చేయడమే కాకుండా బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం.

- వెంకటరావు, తహసీల్దార్, శ్రీకాకుళం రూరల్

సివిల్స్‌లో సత్తాచాటిన సిక్కోలు



చల్లా కళ్యాణి



భవిరి సంతోష్‌కుమార్

శ్రీకాకుళం రూరల్: సివిల్స్ ఫలితాల్లో సిక్కోలు వాసులు సత్తాచాటారు. 285, 607 ర్యాంకులతో మెరిసారు.

కళ్యాణికి 285వ ర్యాంకు

శ్రీకాకుళం మండల పరిధిలోని వప్పంగి గ్రామానికి చెందిన చల్లా కళ్యాణి యూపీఎస్సీ(సివిల్స్) ఫలితాల్లో 285వ ర్యాంకు సాధించారు. ఇప్పటికే గ్రూప్–1 పరీక్షల్లో విజయం సాధించిన ఈమె ప్రస్తుతం విశాఖపట్నంలోని ట్రెజరీ విభాగంలో శిక్షణ తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు అసిరినాయుడు, సత్యవతి. చిన్నప్పటి నుంచి కష్టపడి చదివానని, ఉన్నత స్థాయికి చేరుకోవాలనే సంకల్పంతోనే సివిల్స్ రాశానని చెప్పారు.

సంతోష్‌కుమార్‌కు 607వ ర్యాంకు

సారవకోట: బూర్జ మండలం ఖండ్యాం గ్రామానికి చెందిన భవిరి సంతోష్‌కుమార్ మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాలలో 607వ ర్యాంకు సాధించారు. ఈయన స్వగ్రామం ఖండ్యాం అయినప్పటికీ మండలంలోని అలుదు గ్రామంలో తాతయ్య విశ్రాంత ఉపాధ్యాయుడు పొన్నాన కృష్ణమూర్తి ఇంట్లో ఉండి తన విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. 2020లో ఈయన సివిల్స్ పరీక్ష రాయగా 2021లో విడుదలైన ఫలితాలలో 607 ర్యాంకు సాధించారు. మళ్లీ 2022లో పరీక్ష రాయగా మంగళవారం విడుదలైన ఫలితాలలో మళ్లీ 607వ ర్యాంకే వచ్చింది. తండ్రి రాజారావు విశ్రాంతి ఉపాధ్యాయులు కాగా తల్లి ఉమాకుమారి గృహిణి. 10వ తరగతి వరకు జలుమూరు మండలంలోని చల్లవానిపేటలో గల ప్రైవేట్ పాఠశాలలలో చదివి, ఇంటర్మీడియెట్‌ను నారాయణలో పూర్తి చేశారు. అనంతరం ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని రైల్వే కళాశాలలో డెర్మటాలజీలో పీజీ పూర్తి చేసి చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డెర్మటాలజిస్టుగా విధులు నిర్వర్తించేవారు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్ సాధించాలన్న ఆకాంక్షతో ఐదు సార్లు పరీక్ష రాశారు. ఆరో ప్రయత్నంలో 607వ ర్యాంకు సాధించారు. అప్పుడు ఐపీటీఏఎఫ్ఎస్‌ను కేటాయించడంతో అనంతరం ఢిల్లీలో శిక్షణ తీసుకున్నారు. ఈ ఏడు కూడా 607వ ర్యాంకు సాధించారు. ఈయన ప్రస్తుతం అలుదు గ్రామంలోని యువకులు నిర్వహిస్తున్న హెల్పింగ్ హేండ్స్ ట్రస్టులో సభ్యులుగా ఉంటూ పలు సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. తమ సేవా సంస్థ సభ్యుడికి సివిల్స్‌లో ర్యాంకు రావడంతో ఆ ట్రస్టు సభ్యులు అభినందనలు తెలిపారు.

నేడే విద్యాదీవెన

- జిల్లాలో 49,165 మంది విద్యార్థులకు లబ్ధి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా బుధవారం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయనుంది. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడతను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం బటన్ నొక్కి లబ్ధిదారులకు అందజేయనున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ విడతలో జిల్లాలో 49,165 మంది విద్యార్థులకు అంటే డిగ్రీ, డిప్లమా, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ చదువుతున్న వారికి విద్యా దీవెన అందజేస్తున్నారు. ఈ నగదును విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ చేస్తారు. ఈ సారి జిల్లాలో 44,301 మంది తల్లుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో రూ.36,73,35,926లు జమచేస్తున్నారు.

- ఎస్సీలకు సంబంధించి 123 మంది విద్యార్థులకు గాను 123 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.15,26,959లు జమచేస్తారు.
- ఎస్టీలకు సంబంధించి 1399 మంది విద్యార్థులకు, 1306 మంది తల్లుల ఖాతాల్లో రూ. 78,31,664లు జమకానుంది.
- బీసీ కులాల విద్యార్థులు 45,065 మందికి గాను 40,550 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ. 33,46,29,307లు జమచేయనున్నారు.
- ఈబీసీ విద్యార్థులు 1686 మంది ఉంటే 1556 మంది తల్లుల ఖాతాల్లో రూ. 1,47,17,168లు వేస్తారు.
- మైనారిటీ విద్యార్థులు 161 మందికి, 145 మంది తల్లుల ఖాతాల్లో రూ.11,59,954 లు జమకానుంది.
- కాపు కార్పొరేషన్‌లో 711 మంది విద్యార్థులకు గాను 676 మంది తల్లుల ఖాతాల్లో రూ. 72,27,137లు వేస్తారు.
- క్రిస్టియన్ మైనారిటీలో 20 మంది విద్యార్థులకు గాను 18 మంది తల్లుల ఖాతాల్లో రూ. 2,43,759లు జమకానుంది.

శరణను వారిని కరుణించేవని..



ఆలయంలో బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్‌లో) నీలమణి దుర్గ అమ్మవారు


- నేడు నీలమణిదుర్గ అమ్మవారికి దేవర జంగెడతో ఆహ్వానం
- భారీ బందోబస్తు ఏర్పాటు

పాతపట్నం: నీలమణి దుర్గ ఉత్సవాలకు భక్తజనం పోటెత్తుతున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత జాతర జరుగుతుండడంతో పాతపట్నంలో పండగ సందడి నెలకొంది. ఉత్సవాల్లో పవిత్ర ఘట్టమైన అమ్మవారిని దేవర జంగెడతో గ్రామంలోకి ఆహ్వానం పలికే కార్యక్రమం బుధవారం జరగనుంది. దీనికోసం హెడ్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కాపువీధిలోని ప్రత్యేక ఆలయం నుంచి దేవర జంగిడతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అమ్మవారిని పుష్పం రూపంలో ఊరిలోకి ఆహ్వానించి కాపువీధిలో ఉన్న ప్రత్యేక ఆలయంలో కొలుస్తారు. అమ్మవారి దేవర జంగెడతోపాటు ఏడు ప్రధాన ఘటాలను ప్రతి రోజూ ఊరేగిస్తారు.

ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలకు ఉత్తరాంధ్ర ప్రాంతాలు, రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు పాతపట్నం వచ్చే అవకాశం ఉంది. టెక్కలి నుంచి ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు, శ్రీకాకుళం నుంచి 15 నిమిషాలకు ఒక బస్సు పాతపట్నం చేరుకోవడానికి ఉంటుంది. ఈ నెల 28, 30వ తేదీల్లో రాత్రి 9 గంటల తర్వాత పాతపట్నం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

కొత్తగా 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



పెద్దపండుగకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండేందుకు కొత్తగా 15 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. పండుగలకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి విజ్ఞప్తి మేరకు విద్యుత్ శాఖ నుంచి రూ.93 లక్షలు నిధులు మంజూరైంది. పాతపట్నంలో 12 వీధులకు విద్యుత్ కేబుల్స్, 5 లైన్ వైర్లను ఏర్పాటు చేశాం. ఎస్ఈల ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేస్తాం. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తాం. **- జీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, డీఈ, విద్యుత్ శాఖ, పాతపట్నం**

భారీ బందోబస్తు



అమ్మవారి పెద్ద పండుగల్లో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం. సుమారు 450 మంది పోలీసులతో పాటు ఆర్మ్‌డ్ ఫోర్స్ పది రోజులూ విధుల్లో ఉంటారు. పాతపట్నం నగరానికి శివారుల్లో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రత్యేక మొబైల్ పార్టీలను, ప్రతి వీధికి ఇద్దరు కానిస్టేబుల్స్, ఎస్ఐ నిరంతరం పర్యవేక్షిస్తారు. 24 గంటల పాటు పోలీస్ కంట్రోల్ రూమ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాం. **- ఎం.వినోద్‌బాబు, సీఐ, పాతపట్నం**



ఆలయంలోని అద్దాల మండపంలోని అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

అమ్మవారిని దర్శించుకున్న సబ్ కలెక్టర్

పాతపట్నం: నీలమణి దుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే రెడ్డి శాంతితో కలిసి టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో మంగళవారం దర్శించుకున్నారు. అలాగే ఆలయం ఆవరణలో ఉన్న అద్దాల మండపంలో ఊయలలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యేను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖ అధికారులకు విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ముందుగా ఎమ్మెల్యేకు, సబ్ కలెక్టర్‌కు పూర్ణకుంభంతో ఆలయంలోకి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఆలయ ఈఓ టి.వాసుదేవరావు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాగోలులో వాటర్ ప్లాంట్ సీజ్



ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు రోడ్డులో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న లక్ష్మీభార్గవి బేవరేజెస్ అండ్ వాటర్‌ప్లాంట్‌ను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్‌డీఓ బొడ్డేపల్లి శాంతి, శ్రీకాకుళం తహసీల్దార్ వెంకటరావు సీజ్ చేశారు. ఇటీవల ఈ ప్లాంట్‌ను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నడిపిస్తుండటంతో సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

హిరమండలం: ఎంఎల్‌పురం పంచాయతీ తాళ్లపాడు వద్ద మంగళవారం సాయంత్రం ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. భగీరథపురం రైస్ మిల్లు నుంచి తాళ్లపాడు గ్రామానికి బియ్యం బస్తాలు ఆటోలో తీసుకొస్తుండగా బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో అదే గ్రామానికి చెందిన వి.ప్రసాద్, కొత్తగూడకు చెందిన ఏ.గణేష్‌లకు తీవ్ర గాయాలు కావడంతో 108 సిబ్బంది డి.ముకుందరావు, వి.రాజారావులు ప్రథమ చికిత్స నిర్వహించి కొత్తూరు సీహెచ్‌సీకు తరలించారు.

భయపెట్టిన పొగ



పొగతో నిండిన రోడ్డు

టెక్కలి రూరల్: బలరాంపురం గ్రామ సమీప రహదారి వెంబడి ఉన్న చెత్త కుప్పలకు మంగళవారం నిప్పు అంటుకుంది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ప్రాంతమంతా పొగతో నిండిపోయింది. ఏం జరుగుతుందో తెలియక స్థానికులు రెండు గంటలపాటు తీవ్ర ఆందోళన చెందారు. టెక్కలి-పాతపట్నం రహదారి వెంబడి వెళ్లే వాహనదారులు పొగతో అనేక ఇబ్బందులు పడ్డారు. మంటలు వ్యాపించడానికి కారణం తెలియరాలేదు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌కు వేళాయె..!



శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ఉపాధే లక్ష్యంగా..



పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ మేరకు జరుగుతుంది. ప్రోసెసింగ్ ఫీజు చెల్లించి విద్యార్థులు ధృవీకరణ పత్రాల పరిశీలనకు హాజరుకావాలి. ర్యాంకు కార్డు, హాల్ టికెట్‌తో పాటు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలి. సాంకేతిక విద్యాశాఖ పక్కాగా పాలిటెక్నిక్ కోర్సులు నిర్వహిస్తోంది. ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా కోర్సుల నిర్వహణ ఉంటుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– జి.రాజశేఖర్, ప్రవేశాల కో–ఆర్డినేటర్, ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

- రేపటి నుంచి జూన్ 1 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు
- జూన్ 6 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన
- 9న సీట్ల కేటాయింపు
- 15 నుంచి తరగతులు ప్రారంభం

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు	సీట్లు
శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్	300
శ్రీకాకుళం మహిళా పాలిటెక్నిక్	120
ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్	120
టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్	120
సీతంపేట మోడల్ పాలిటెక్నిక్	120

ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలు	సీట్లు
వెంకటేశ్వర, ఎచ్చెర్ల	462
శివానీ, చిలకపాలెం	263
ఐతం, టెక్కలి	396
టీవీఆర్, మందస	297
నారాయణ, గూడెం	293

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యా శాఖ పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించగా, 20న ఫలితాలు వెల్లడించింది. జిల్లా నుంచి 11,198 మంది పరీక్ష రాయగా 9705 మంది ఉత్తీర్ణత సాధించారు. షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో హెటీటీపీఎస్://ఏపీపీవోఎల్‌వైసీఈటీ.ఎన్‌ఐసీ.ఇన్‌లో నెట్, డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించాలి. ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 చొప్పున ఈ నెల 25 నుంచి జూన్ 1 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 29 నుంచి జూన్ 5 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుంది. ఇందుకోసం శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటు ఏర్పాటు చేశారు. ప్రత్యేక కేటగిరీల స్పోర్ట్స్, గేమ్స్, ఎన్‌సీసీ, ఆంగ్లో ఇండియన్లు, క్యాప్, దివ్యాంగులు ఇతర ప్రత్యేక రిజర్వేషన్లు కలవారు విజయవాడలోని పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరుకావాల్సి ఉంటుంది. జూన్ 7న ఆప్షన్ల మార్పు, 9న సీట్ల కేటాయింపు, 15 నుంచి క్లాస్ వర్క్ ప్రారంభం కానుంది.

ధ్రువీకరణ పత్రాల పరిశీలన షెడ్యూల్

తేదీ	ర్యాంకు
29	1-12000
30	12001-28000
31	28001-43000
జూన్ 1	3001-58000
2	58001-74000
3	74001-91000
4	91001-108000
5	10800-చివరి వరకు

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



అరసవల్లి సూర్యనారాయణ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావు కుటుంబసమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ పరిసరాలు ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్నాయని జస్టిస్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రోటోకాల్ జడ్జి కె.రాణి, ఇతర న్యాయమూర్తులు ఎంఎస్ ఫణికుమార్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జడ్జి పి.భాస్కరరావు, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. –అరసవల్లి

నేడు ఐ-సెట్



ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఐసెట్-2023 ఆన్‌లైన్ పద్ధతిలో బుధవారం నిర్వహించనున్నారు. జిల్లాలో టెక్కలి ఐతం, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర, చిలకపాలెం శ్రీ శివానీ కాలేజీల్లో రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11.30 గంటలకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఐదు వరకు రెండో షిఫ్ట్ నిర్వహించనున్నారు. విద్యార్థులను గంట ముందు పరీక్ష కేంద్రానికి అనుమతిస్తారు. హాల్ టిక్కెట్‌తో పాటు, మరో గుర్తింపు కార్డుతో విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. –ఎచ్చెర్ల క్యాంపస్

'శిక్షణ సద్వినియోగం చేసుకోండి'

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు) శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని అవగాహన పెంచుకోవాలని డీఎంహెచ్‌ఓ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రిలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి మంగళవారం ఆమె హాజరయ్యారు. అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స, పాముకాటు, ఐవీ ఇన్‌ఫ్యూజన్, లైఫ్ సేవింగ్ స్కిల్స్‌పై ఎంఎల్‌హెచ్‌పీలకు అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో చేపట్టాల్సిన విధులను వివరించారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు, సీనియర్ వైద్యులు శ్రీరాములు పాల్గొన్నారు. – టెక్కలి రూరల్



పాలనలో మార్పు గమనించండి

గార: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నాలుగేళ్లలో పాలనలో మార్పు గమనించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మంగళవారం గార మండలం పూసర్లపాడులో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామంలో పరిపాలన భవనం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మన ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిందని, వైఎస్ జగన్‌మోహనరెడ్డి లాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండటం వల్ల ఎంత మంచి జరిగిందో చూడాలన్నారు. గ్రామంలో జరిగిన మార్పులు గమనించాలన్నారు. గతంలో మాదిరిగా మండల కార్యాలయానికి వెళ్లకుండా గ్రామంలోనే అన్నిసేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. గతంలో చాలా మంది చెప్పారని, ఏమీ జరగలేదని, మేం మాత్రం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని, ఏదైనా చేయలేకపోతే నేను చెయ్యలేకపోతున్నాను అని ధైర్యంగా చెప్పగల్గిన వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. గ్రామాల్లో తగాదాలకు చాలావరకు కారణం భూమి వివాదాలేనని, దీనికోసం ఎవ్వరూ ఆలోచించలేదన్నారు. సమగ్ర సర్వే జరిగి 100 ఏళ్లు పూర్తయ్యిందని, ఇన్నేళ్లుగా ఎన్ని ప్రభుత్వాలు మారినా రీసర్వే చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ముందుడుగు వేసి సర్వే చేయడంతో పాటు హద్దురాళ్లు వేసి ఉచితంగా పాసుపుస్తకాలు ఇస్తున్నారని చెప్పారు. త్వరలోనే అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. ఇవన్నీ మీరు ఓటు వేయడం వల్లే సాధ్యమైందని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో రూ.12వేల కోట్లు ఖర్చు చేసి 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చామని, చంద్రబాబు హయాంలో ఒక్క ఎకరా భూమి అయినా కొని పేదలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. పేదలకు ఇంత ప్రయోజనం చేకూరుస్తున్న ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని కోరారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులకు లంచం ఇవ్వకుండా ఏ పనీ జరిగేది కాదని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ అరవల కల్పన, అరవల చిన్న అప్పారావు, అరవల రామకృష్ణ, పీస శ్రీహరిరావు, పీస గోపి, ముంజేటి కృష్ణమూర్తి, సుగ్గు మధురెడ్డి, మార్పు పృథ్వీరాజ్, గొల్లంగి ఆరుద్ర, గొల్లంగి వెంకటేశ్వర్లు, జల్లు గౌరిపతినాయుడు, మళ్ల చిన నారాయణమూర్తి, చింతల గడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ శిలాఫలకం ధ్వంసం

మందస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కొందరు ఓర్వలేకపోతున్నారు. శంకుస్థాపనకు సిద్ధం చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసి పైశాచికానందం పొందుతున్నారు. మేజరు పంచాయతీ మందస తరువాత హరిపురం పంచాయతీకి ఎంతో ప్రాధాన్యత ఉంది. వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతోంది. ఈ పంచాయతీ ప్రజలకు గతంలో మంజూరు చేసిన జగనన్న కాలనీ స్థలం వివాదం చోటు చేసుకోవడంతో అధికారులు స్థలాన్ని వేరేచోటకు మార్చారు. హరిపురానికి జగనన్న కాలనీ ఎంతో అవసరం. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రత్యేక కృషితో అంబుగాం-బొడ్డూరు-నోతువార సమీపంలో జగనన్న కాలనీలో సుమారు 60మందికి ఇళ్లు కట్టివ్వడానికి చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 23న హరిపురంలో జరిగే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడానికి శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, సర్పంచ్ జగన్నాథపురం పురుషోత్తం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ తిరుమలరావు, సర్పంచ్ పురుషోత్తం

ముగిసిన ఏపీ ఈఏపీసెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 15న ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023 (ఏపీ ఈఏపీ సెట్) పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 15 నుంచి 19వరకు ఇంజినీరింగ్ పరీక్షలు జరగ్గా, సోమ, మంగళవారాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు నిర్వహించారు. చివరి రోజు మంగళవారం టెక్కలి ఐతంలో మొదటి షిఫ్టులో 120 మంది, రెండో షిఫ్టులో 123 మంది, ఎచ్చెర్ల శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 175 మంది, రెండో షిఫ్టులో 176 మంది, చిలకపాలెం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 181 మంది, రెండో షిఫ్టులో 182 మంది హాజరయ్యారు. ఇంజినీరింగ్‌లో 5517 మంది దరఖాస్తు చేయగా 5318 మంది, అగ్రికల్చర్, ఫార్మసీల్లో 2027 మందికి గాను 1915 మంది పరీక్ష రాశారు.



శివానీలో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సెంచూరియన్‌తో మొరాకో ప్రభుత్వం ఒప్పందం

పర్లాకిమిడి: వాయువ్య ఆఫ్రికా ఖండంలోని మొరాకో దేశం వివిధ రంగాల్లో కలిసి పనిచేసేందుకు స్థానిక సెంచూరియన్ వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. వ్యవసాయం, చేపల పెంపకం, నైపుణ్యాభివృద్ధి, మినీ డెయిరీ, బ్యాకరీ, డ్రాగన్ ఫ్రూట్, ఉన్నత విద్య టెక్నాలజీ, 3డీ ల్యాబ్ నిర్మాణానికి ఆఫ్రికా-ఇండో ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఈ నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు నలుగురు సభ్యుల మొరాకో ప్రభుత్వ అధికార బృందం పర్లాకిమిడి సెంచూరియన్ క్యాంపస్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ బోర్డు హాలులో జరిగిన విలేకర్ల సమావేశంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయక్ మాట్లాడారు. నీతి ఆయోగ్, ఇండో-ఆఫ్రికా ద్వైపాక్షిక సంబంధాల మేరకు మొరాకో ఉన్నత విద్యాభివృద్ధి అధికారి మహ్మద్ తహ్రీ, అమెరికా-ఆసియా మైత్రి భాగస్వామ్యుల ఇన్‌చార్జి అబ్దుల్లా ఫెజర్, సలహాదారు మొరాకో ఉన్నత విద్యాశాఖ అమల్ లరిబీ వర్సిటీని సందర్శించారని తెలిపారు. అక్కడి దేశంలో పారిశ్రామిక నైపుణ్యం, అనుసంధాన విద్య, వ్యవసాయంలో సాంకేతికత, యాంత్రీకరణ, వస్తు తయారీ, ఏరోస్పేస్, ఆహార శుద్ధి, ఐటీ తదితర రంగాలలో ఇరుదేశాలు సహకారం అందిపుచ్చుకునేందుకు ఆసక్తి చూపించారని వెల్లడించారు. మొరాకో అధికారి మహ్మద్ తహ్రీ మాట్లాడుతూ.. సెంచూరియన్‌లతో కలిసి పనిచేేందుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రొ, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రభుత్వ సంబంధాల అసోసియేట్ డైరెక్టర్ మోనాలిసా ఘోష్, వ్యయసాయ కళాశాల డీన్ డాక్టర్ ఎస్పీ నందా తదితరులు పాల్గొన్నారు.



ద్వైపాక్షిక ఒప్పంద సమావేశంలో మాట్లాడుతున్న వీసీ సుప్రియా పట్నాయక్

ఆర్మీ జవాన్ల స్వచ్ఛభారత్

వజ్రపుకొత్తూరు రూరల్: సీతాపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్లు దేశానికి సేవలు అందించడంతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారు. సైనిక సేవాదళ్ సేవా సంఘం ఏర్పాటు చేసి మంగళవారం గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. కాళీమాత, పాతపట్నం అమ్మవారు ఆలయాల ప్రాంగణం, రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు వై.కాళిదాసు, ఉపాధ్యక్షుడు టి.బాలకృష్ణ, కార్యదర్శి టి.మురళి, బి.కృష్ణారావు, టి.మోహన్‌రావు, బి.వాసుదేవ్, జి.భీమారావు, టి.సంతోష్, బి.ధనుంజయ, టి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



చెత్తాచెదారాలు తొలగిస్తున్న జవాన్లు

రైతులకు ఆసరాగా 'గరుడ'

శ్రీకాకుళం రూరల్:

గరుడ ఏరోస్పేస్‌తో పురుగుల మందును సులభంగా పిచికారీ చేయవచ్చని వ్యవసాయ సంయుక్త సంచాలకుడు కె.శ్రీధర్ అన్నారు. సింగుపురం సమీపంలోని రోణంకి వద్ద వ్యవసాయ పొలంలో రైతుల సమక్షంలో గరుడ ఏరోస్పేస్ డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యంత్రంతో పావుగంట వ్యవధిలోనే ఎకరా పొలానికి స్ప్రే చేయవచ్చన్నారు. కూలీల కొరతను అధిగమించడమే కాకుండా పంట మొత్తం క్రిమిసంహారక మందులు స్ప్రే చేసేందుకు ఏరోస్పేస్‌తో వెసులుబాటు కలుగుతుందన్నారు. 40 శాతం సబ్సిడీతో రవిరాజ్ ఆటో సర్వీసెస్‌లో రైతులకు అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు బి.రజని, శ్రీకాకుళం మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి, ఏఈఓ ఎరుకనాయుడు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



విద్యాభివృద్ధే ధ్యేయంగా..



మందస మండలం హరిపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. – మందస

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,100–00
బంగారం(22సి. 10గ్రా.)	56,000–00
వెండి (కిలో)	78,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 485.00
శ్రీకాకుళం	రూ. 485.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260